క్లుప్తంగా

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.2,00,565 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుడి శత జన్మదిన వేడుకలు



తాళ్లపూడిలో విశ్వేశరరావు 100వ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

తాళ్లపూడి: గ్రామానికి చెందిన వృద్ధుడు గోకవరపు విశ్వేశరరావు 100వ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని తొలితరం ఆర్యవైశ్య ప్రముఖుల్లో ఆయన ఒక్కరు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నలుగురు సోదరులు, ఇద్దరు అక్క చెల్లెళ్లు ఉన్నారు. సుమారు 200 మంది వరకూ కుటుంబ సభ్యులు ఉన్నారు. వారంతా కలిసి విశ్వేరరరావు, తాయారు దంపతులు, ఇతర కుటుంబ సభ్యుల నడుమ 100వ పుట్టిన రోజు వేడకలను ఘనంగా నిర్వహించారు.

రీసర్వేపై ముందస్తు సమాచారం అందించాలి

నల్లజర్ల: మండలంలోని వీరవల్లిలో సోమవారం నుంచి నిర్వహించనున్న రీసర్వే విషయమై రైతులందరికీ ముందస్తు సమాచారం అందించాలని రెవెన్యూ సిబ్బందికి డిప్యూటీ తహసీల్దారు శాంతిప్రియ సూచించారు. మండలంలో ముందుగా రీసర్వే చేసేందుకు వీరవల్లిని ఎంపిక చేసినట్టు చెప్పారు. గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు సర్వే జరిగే గ్రామంలోని భూయజమానులందరికీ సమాచారం అందించాలన్నారు. ఇప్పటికే రీసర్వేపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

కొవ్వూరు: వాడపల్లి గ్రామానికి చెందిన బెజవాడ పోచమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30,028 మంజూరయ్యాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం బాధితురాలికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చెక్కు అందజేశారు.

వైద్య విద్యార్థి మృతితో విషాదఛాయలు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం సమిశ్రగూడెం విజ్ఞాన్-వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఆత్కూరి రామారావు పెద్ద కుమారుడు సాయి మణిదీప్ (21) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో విషాదఛాయలు అలముకున్నాయి. తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన రామారావుకు ఇద్దరు కుమారులు ఉండగా సాయి మణిదీప్ విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. హాస్టల్ రూమ్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కన్నీటిపర్యాంతమవుతున్నారు. సాయి మణిదీప్ మృతి చెందడంతో సంతాపంగా ఈనెల 20న విజ్ఞాన్ వికాస్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై శనివారం ప్రమాదంలో మానస ఫణికుమార్, ఆయన భార్య సరస్వతీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరంలో ఫణికుమార్ చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్నారు. భార్యతో కలిసి మోటారు సైకిల్‌పై ధవళేశ్వరం వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరికి బలమైన గాయాలయ్యా యి. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

దేవరపల్లి: యర్నగూడెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు. యర్నగూడెం, త్యాజంపూడి, గాంధీనగరం, సంగాయగూడెం ఫీడర్లపై గల వ్యవసాయ, గృహవినియోగదారుల సర్వీసులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు.

పక్కాగా.. ఓటర్ల లెక్క

- తేలిన గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య
- డివిజన్‌లో 24,794 మంది ఓటర్లు
- కొవ్వూరులో గరిష్ఠంగా 5,193 మంది
- డివిజన్‌లో 37 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



కొవ్వూరు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్కారు సన్నద్ధమువుతోంది. దీనిలో భాగంగా ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసింది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 24,794 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలింది. సహజంగా జనరల్ ఓటర్ల జాబితాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండడం చూస్తుంటాం. గ్రాడ్యుయేట్ ఓటర్లు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నారు. మహిళలకు యుక్త వయస్సు రాగానే పెళ్లిళ్లు చేయడంతో పాటు ఉన్నత చదువులు ఆపివేయడం వంటి కారణాలతో గ్రాడ్యుయేషన్ చేసిన మహిళల సంఖ్య తక్కువగా కనిపిస్తోంది.

డివిజన్ పరిధిలో..

డివిజన్ పరిధిలో కొవ్వూరు మండలంలో గరిష్ఠంగా 5,193 మంది ఓటర్లు ఉన్నారు. నిడదవోలు మండలం 3,963 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉంది. గోపాలపురం మండలం అత్యల్పంగా 1,779 ఓటర్లు ఉన్నారు. మిగిలిన అన్నీ మండలాల్లోనూ మూడు వేల మంది లోపు మాత్రమే ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 14,529 మంది పురుష ఓటర్లు ఉంటే 10,265 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. తొలుత గతేడాది నవంబర్ 6 వరకూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తుండడంతో నమోదు గడువును 8వ తేదీ వరకూ పొడిగించింది. నవంబర్ 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ముద్రించారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో డిసెంబర్ 9వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి 30న తుది జాబితా వెల్లడించారు. గడువు పెంచడం మూలంగా డివిజన్‌లో 2,723 మంది ఓటర్లు పెరిగారు. దీనిలో పురుషులు 1,482 మంది పెరిగితే, మహిళా ఓటర్లు గతంలో కంటే 1,241 మంది పెరిగారు. డివిజన్‌లో తుది జాబితా సిద్ధమైంది.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

డివిజన్‌లో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటిలో గరిష్ఠంగా కొవ్వూరు మండలంలో ఎనిమిది, నిడదవోలులో ఐదు, చాగల్లు, ఉండ్రాజవరం, నల్లజర్ల మండలాల్లో నాలుగేసి చొప్పున, దేవరపల్లి, గోపాలపురం, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో మూడేసి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పురుష ఓటర్లదే ఆధిక్యం

డివిజన్‌లో మహిళా ఓటర్ల కంటే 4,264 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. కొవ్వూరులో గరిష్ఠంగా 2863 మంది, నిడదవోలులో 2249 మంది చొప్పున పురుష ఓటర్లు ఉన్నారు. నల్లజర్ల మండలంలో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు 641 మంది ఉంటే కొవ్వూరులో 533 మందితో రెండో స్థానంలో ఉంది. పెరవలి మండలంలో స్త్రీ, పురుష ఓటర్ల మధ్య వ్యత్యాసం కాస్త తక్కువగా ఉంది. ఇక్కడ మహిళల కంటే పురుష ఓటర్లు 293 మంది అధికంగా ఉన్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, పెరవలి, తాళ్లపూడి మండలాల్లో మహిళా ఓటర్లు మొత్తం ఓటర్లలో 1000 లోపే ఉన్నారు. కొవ్వూరు, నిడదవోలు మండలాలను మినహాయిస్తే చాగల్లు, నల్లజర్ల, ఉండ్రాజవరం మండలాల్లో మాత్రం పురుష ఓటర్లు 1500లకు పైబడి ఉన్నారు.

తుది జాబితాలు సిద్ధం



గ్రాడ్యుయేట్ ఓటర్ల తుది జాబితాలు సిద్ధం చేశాం. ఆయా మండలాల్లో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. డివిజన్‌లో 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. కొవ్వూరులో గరిష్ఠంగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలు రాగా ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో మండలానికి కనిష్ఠంగా మూడు చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. గ్రాడ్యుయేట్ ఓటర్లలో మహిళ ఓటర్ల సంఖ్య కంటే పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయితే ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం.

– రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
చాగల్లు	4	1,534	1,095	2,369
దేవరపల్లి	3	1,329	843	2,173
గోపాలపురం	3	1,095	684	1,779
కొవ్వూరు	8	2,863	2,330	5,193
నల్లజర్ల	4	1,583	941	2,523
నిడదవోలు	5	2,249	1,714	3,963
పెరవలి	3	1,110	817	1,927
తాళ్లపూడి	3	1,182	760	1,942
ఉండ్రాజవరం	4	1,585	1,081	2,666
మొత్తం	37	14,529	10,265	24,794

అమిత్‌షా రాజీనామా చేయాలి



అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్ష పార్టీలు పిలుపు మేరకు స్థానిక మార్కెట్ వద్ద డాక్టర్ అంబేడ్కర్ చౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఖండించక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ఉండ్రాజవరం: ముత్యాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కె.సావరం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కె.సావరం, టి.వేమవరం, జంగంచెరువు గ్రామాల ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముందుగా ఆలయం వద్ద చిన్నారులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. శనివారం రాత్రి వెంకట ముత్యాలమ్మ కోలాట భజన మండలి వారితో హరే శ్రీనివాస కోలాటం నృత్యం పలువురిని ఆకట్టుకుంది.

చదువుతోనే ప్రతి ఒక్కరికీ గుర్తింపు



సమిశ్రగూడెంలో వడ్లమూడి దేవదాసు, సుదర్శన్‌లను సన్మానిస్తున్న యువజన సేవా సంఘం సభ్యులు

నిడదవోలు రూరల్: చదువుతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని తృప్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు వడ్లమూడి దేవదాసు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన జిమ్, గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం బాబు యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 9 అడుగుల విగ్రహానికి శంకుస్థాపన చేశారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. వడ్లమూడి దేవదాసు, సుదర్శన్‌లను యూత్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బాబు యువజన సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి రాజారత్నం, కార్యదర్శి కొల్లి శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో ?

- అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు
- అద్దె భవనంలోనే తరగతులు



బ్రాహ్మణగూడెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం నడివీధిలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో నాడు–నేడు నిధులు రూ.4.50 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ భవన నిర్మాణం పూర్తి చేయాడానికి నిధులు కేటాయించకపోవడంతో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. భవన నిర్మాణంలో భాగంగా శ్లాబ్ నిర్మాణానికి రూ.60 వేలతో అభివృద్ధి కమిటీ కొనుగోలు చేసిన ఐరన్ మెటీరియల్ భవనం వద్ద నిరుపయోగంగా కనిపిస్తోంది. నల్లకంకరది కూడా అదేతీరు. పర్యవేక్షణ లేకపోవడంతో కొంత ఐరన్ ఇష్టారాజ్యంగా ఎవరికి వారే అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్న ఐరన్ కూడా వర్షాలకు తడవడంతో తుప్పు పట్టి భవనం శ్లాబ్ నిర్మాణానికి పనికిరాదనే వాదనలు ఉన్నాయి. భవన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారుల వ్యవహార శైలి కారణంగా సుమారు ఏడాది క్రితమే శ్లాబ్ నిర్మాణానికి ఐరన్ కొనాల్సి వచ్చిందనే పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సొంత భవనాలు లేక ఇక్కట్లు

గ్రామంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సొంతభవనాలు మూడు ఉండగా మిగిలిన రెండు అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అసంపూర్తి నిర్మాణంలో ఉన్న భవనం పూర్తి చేయడమే గాక మరో భవనం మంజూరు చేసి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిర్మాణానికి కొనుగోలు చేసి నిరుపయోగంగా వదిలేసిన ఐరన్ మెటీరియల్

ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాత పరీక్ష



కొవ్వూరులో రేషన్ డీలర్ల రాత పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: డివిజన్‌లో ఖాళీగా ఉన్న 73 రేషన్ దుకాణాలకు డీలర్ల భర్తీలో భాగంగా ఆదివారం దరఖాస్తుదారులకు కొవ్వూరులో రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 185 మంది నుంచి దరఖాస్తులు రాగా వీటిలో వివిధ రకాల కారణంగా 53 మంది అనర్హుల దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన రాత పరీక్షకు ఎనిమిది మంది గైర్హాజరు కాగా 126 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. 80 మార్కులకు రాత పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఈ నెల 21న పరీక్ష పేపర్లను మూల్యాంకనం చేస్తామన్నారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 28న 20 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 31న తుది ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆర్డీవో ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఆర్ఐ బి.విశేశ్వరరావు, సీఎస్ డీటీ సునీత, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సాధు మహాసభలు

- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన సాధువులు
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన ప్రాంగణం
- భారీగా తలిరి వచ్చిన భక్తులు



దేవరపల్లిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలో హిందూమతం గురించి వివరిస్తున్న స్వామీజీలు

దేవరపల్లి: అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహాసభలు స్థానిక కరుటూరి ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. సభలను పరిషత్ అధ్యక్షుడు మాతా పరావిద్యానందగిరి స్వామిని ప్రణవ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. సాధు మహాత్ములు చిత్రపట ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన చేశారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వరానందగిరి స్వామి పరిచయ వ్యాఖ్యలు చేశారు. 59వ సంచికను మాతా పరావిద్యానందగిరి స్వామిని ఆవిష్కరించారు. ఉభయ తెగులు రాష్ట్రాల్లోని వివిధ ఆశ్రమాలకు చెందిన అధిపతులు వాసుదేవానంద సరస్వతి స్వామి, పరమేశ్వరానందగిరి స్వామి, గీతాప్రచారానందగిరి స్వామి, భక్తిచైతన్యానంద సరస్వతీ స్వామి, సచ్చిదానందగిరి స్వామి ప్రథమ సభలో పాల్గొని ప్రసంగించారు. హిందూ మతాన్ని భావితరాలకు బోధించాలన్నారు. హిందూధర్మం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఇంటిలో నలుగురు పిల్లలు ఉద్భవించాలని స్వాములు తెలిపారు. భగవద్గీత ప్రతి ఒక్కరూ పఠనం చేయాలన్నారు. భగవద్గీతలోని కర్మ షట్కం మొదటి ఆరు అధ్యాయాలు పారాయణ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సభ నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో సభా ప్రాంగణం మార్మోగింది. స్వాములకు, సాధువులకు స్థానిక ఆహ్వాన కమిటీ వసతి, భోజన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 21 వరకు మహాసభలు జరగనున్నాయి. దేవరపల్లి మండల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆహ్వాన కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, బళ్ల సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి వెంకటరామారావు, ఆచంట వెంకటసత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభలకు ఏర్పాట్లు చేశారు.

ఆదర్శప్రాయుడు వైఎస్సార్



గోపాలపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపురం: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నేటి యువత ప్రయాణించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కూసం రామమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 15 సంవత్సరాలుగా వైఎస్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు.అనంతరం ప్రథమ బహుమతి సాధించిన చాగల్లు జట్టుకు వైఎస్ ఆర్మీ యూత్ సభ్యులు రూ.50 వేల నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి సాధించిన ఐ పంగిడి జట్టుకు రూ.25 వేల నగదు, షీల్డ్‌ను రాజమహేంద్రవరం ఫస్ట్ ప్లస్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బొమ్మారెడ్డి కళాదర్‌రెడ్డి అందించగా నాయకులు రామమోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముల్లంగి శ్యామ్ సుందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి విజేతలకు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ బలరాం, బెస్ట్ బౌలర్ సంజులకు వైఎస్ ఆర్మీ సభ్యులు రూ.5 వేలు, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఆర్మీ సభ్యులు వీఎన్‌డీ గణేష్, ఎం.సంజయ్, జీవీ రమణ, ఎం.కృపావరప్రసాద్‌రెడ్డి, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నీటి తడుపుల్లేకుంటే మంచిది

- పూత, పిందె దశలో మామిడి తోటలు
- యాజమాన్య పద్ధతులు అవసరం
- సూచనలు పాటించాలంటున్న ఉద్యానశాఖాధికారి బబిత



పూత దశలో ఉన్న మామిడి చెట్టు

నల్లజర్ల: ప్రస్తుతం మామిడి తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. డిసెంబర్, జనవరిలో పూసిన పూత నిలబడి దిగుబడి రావాలంటే ఈ దశలో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలని నల్లజర్ల ఉద్యాన శాఖాధికారి బబిత సూచిస్తున్నారు.

నీటి తడుపులు ఇలా..

- చెట్లు పూత దశకు వచ్చే వరకు భూమిలో అతి తక్కువ నీటి శాతం ఉండేలా చూడాలి. పూత మొగ్గలు బయటకు వచ్చే వరకు నీటి తడులు ఇవ్వకూడదు. ఒక వేళ వర్షం పడితే దున్నకూడదు. చెట్లన్నీ ఒకే సారి పూత మొగ్గలు బయటకు రాగానే ఒక సారి తడి ఇవ్వాలి. దీనివల్ల పూతకు అవసరమయ్యే రసాయనాలు, హార్మన్లు ప్రతి రెమ్మకు, మొగ్గకు త్వరగా చేరుతాయి.
- చలిగాలులు వల్ల పూత ఆలస్యమైతే అలాంటి తోటల్లో ప్లానోఫిక్స్ ఒక మిల్లీ లీటరు 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే త్వరగా పూత వచ్చే అవకాశం ఉంది.
- ముదురు లేత తోటల్లో పూత నుంచి పసుపు పూతకు మారుతున్నపుడు లేదా జొన్నగింజ సైజులో పిందె ఉన్నపుడు నీరు పెడితే పిందె త్వరగా పెరుగుతుంది. దీంతో పిందె రాలడం 25 శాతం వరకు నివారించవచ్చు.
- మామిడి చెట్లు దాదాపు 50, 60 శాతం పూత, పిందెలు జొన్నగింజంత సైజులో ఉన్నపుడు నీటి తడి ఇవ్వడం వల్ల మొగ్గ, పూత రాని కొమ్మలు కూడా పూతకు వచ్చే అవకాశం ఉంది. అంతేకాక నీటి ద్వారా చెట్లు స్థూల, సూక్ష్మ పోషకాలను గ్రహిస్తాయి. అప్పుడు పిందె రాలదు.

ఎరువుల యాజమాన్యం

కాయలు పిందె దశలో ఉన్నపుడు చెట్టుకు కిలో యూరియా, 1.6 కిలోల పొటాష్ ఎరువు వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల కాయలు 110 రోజుల్లో సుమారు 400 గ్రాముల వరకు పెరుగుతాయి.

పిందెలు రాలుతుంటే



సాధారణంగా మామిడి పిందెలు జొన్నగింజ సైజు నుంచి గోళికాయ పరిమాణంలోకి ఎదిగినప్పుడు ఎక్కువగా రాలిపోతుంటాయి. నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రతలు, పోషక లోపాలు, చీడ పీడలు, హార్మోన్ లోపాల కారణంగా పిందెలు రాలిపోతాయి. పది లీటర్ల నీటికి 2.5 మిల్లీలీటర్ల ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేస్తే పిందె రాలడం తగ్గుతుంది.

– ఎం.బబిత, ఉద్యానశాఖాధికారి, నల్లజర్ల

పూత రాలిపోతుంటే..

అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి, పరపరాగసంపర్కం కోసం తోడ్పడే మిత్ర పురుగులు లేకపోవడం, చీడపీడలు ఆశించడం వల్ల పూత రాలిపోవడం, మాడిపోవడం వంటివి జరుగుతాయి. ఈదశలో బోరాన్ 20 శాతం 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీంతోపాటు 1.5 గ్రాముల నుంచి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి కొత్త చిగురు వచ్చేటపుడు, పూమొగ్గలు పెరుగుదల దశలో ఉన్నపుడు చెట్లు బాగా తడిసేలా పిచికారీ చేయాలి.